# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలు ఉమ్మడిగా పోరాడాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **తెలంగాణలో నిర్వహించే వనమహోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈరోజు పాల్గొంటారు.**
3. **పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**
4. **కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.**
5. **ఇంగ్లండ్‌తో జరిగిన రెండవ టెస్ట్ మ్యాచ్‌లో భారత్ 336 పరుగుల తేడాతో విజయం సాధించింది.**

==========================

ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలు ఉమ్మడిగా పోరాడాలని, ఉగ్రవాదులపై ఆంక్షలు విధించేందుకు ఎంతమాత్రమూ సంకోచించకూడదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరం వేదికగా నిన్న ప్రారంభమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాన మంత్రి ప్రసంగించారు. ఉగ్రవాదం నేడు మానవాళికి అత్యంత తీవ్రమైన సవాలుగా మారిందని అన్నారు. బ్రిక్స్ సభ్య దేశాలు ఉగ్రవాదం, దాని మద్దతుదారులకు వ్యతిరేకంగా సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. మానవాళి సంక్షేమానికి శాంతి మార్గం సరైన ఎంపిక అని భారతదేశం దృఢంగా నమ్ముతుందని అన్నారు. శాంతియుత, సురక్షితమైన వాతావరణంలోనే మానవాళి అభివృద్ధి సాధ్యమని, ఈ లక్ష్యాన్ని నెరవేర్చడంలో బ్రిక్స్ చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ప్రధానమంత్రి తెలిపారు.

-------------------------

తెలంగాణలో నిర్వహించే వనమహోత్సవంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈరోజు పాల్గొంటారు. హైదరాబాద్ లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ముఖ్యమంత్రి ఈ ఉదయం 11 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో మంత్రులు, శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. వనమహోత్సవంలో విద్యార్థులను భాగస్వాములను చేసేలా 'ఒక విద్యార్థి.. ఒక మొక్క' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందని అధికారులు తెలిపారు.

---------------------------

కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ఆయన నిన్న కర్నూలులో ఇంటింటికి వెళ్లి, ప్రభుత్వ పాలన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు నగరంలో బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ నిన్న ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచి భక్తులు.. బారాషాహిద్ దర్గాను సందర్శించుకుని స్వర్ణాల చెరువులో రొట్టెలు పంచుకుంటున్నారు. ఈ నెల 10వ తేదీ వరకు రొట్టెల పండుగ జరగుతుంది. రాష్ట్రప్రభుత్వం భక్తుల కోసం టెంట్లు, తాగునీరు, ఉచిత భోజన ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కాగా ఈరోజు సాయంత్రం విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దర్గాను సందర్శించి రొట్టెల పండుగలో పాల్గొంటారు.

---------------------------

అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆయన నిన్న పంపిణీ చేశారు. తొలి ఏడాదిలోనే 22 వేల500 కోట్ల రూపాయలతో 4లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని ఉపముఖ్యమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ,

వాయిస్…20 సెకన్లు

---------------------------

సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం, అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నగరాల సామాజిక వర్గ ప్రతినిధులు మంత్రితో నిన్న సమావేశమై వారి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కుల ధ్రువీకరణ పత్రాల జారీపై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగరాల సామాజిక వర్గాన్ని బీసీ–డీలుగా గుర్తించి, ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

---------------------------

పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. విజయనగరంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించడంతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఇకపై భక్తులకు వడల

ప్రసాదాన్ని అందిస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. గతరాత్రి తిరుమలలో వడల ప్రసాదాన్ని అందించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఆర్ నాయుడు మాట్లాడుతూ..

..వాయిస్.. 18 సెకన్లు

------------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం "క్యాచ్ ది రైన్" కార్యక్రమాన్ని చేపట్టింది. "ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం" అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో ఈ ప్రచారాన్ని ఈ ఏడాది మార్చి 22 నుండి నవంబర్ 30 వరకు నిర్వహిస్తోంది.

కాగా.. "క్యాచ్ ది రైన్" పై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు ప్రసారమవుతుంది.

------------------------------

రైతులు పండించే అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీస్కుంటున్నామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల బస్తాల యూరియా, 8 లక్షల బస్తాల డీఏపీ, 66 లక్షల బస్తాల కాంప్లెక్స్ ఎరువులు, జిల్లా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

------------------------------

అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్ బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్ బాస్టన్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన రెండవ టెస్ట్ మ్యాచ్ లో భారత్ 337 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. 608 పరుగుల లక్ష్య చేధనలో ఇంగ్లాండ్ జట్టు 271 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భారత బౌలర్స్‌లో ఆకాష్ దీప్ రెండు ఇన్నింగ్స్ లో కలిపి మొత్తం 10 వికెట్లతో రాణించాడు. అంతకముందు భారత కెప్టెన్ శుభ్‌మన్‌గిల్ రెండు ఇన్నింగ్స్‌తో కలిపి 430 పరుగులు చేసి భారత విజయంలో కీలక పాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. ఈ విజయంతో ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ 1-1తో సమం అయ్యింది.

------------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...20 సెకన్లు

మరోవైపు తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాలలోని భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఈరోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================